# మతిమరుపు మనుష్యులు

శ్రీ సి. డి. ఎస్. రామయ్య

ఎబ్బెబ్బే! ఎంత కెంత మతిమరుపు!! ఈ వ్యాసాన్ని రాయాలని క్రిందటనెలలోనే అనుకున్నాను; కూర్చుని కాగితం మీద ఏదో రాయనుగూడా రాశాను. కాని, వ్యాసాన్ని రాయక, పుట్టింటికి పోయివున్న మాఆవిడకి వుత్తరం రాశేశాను. ఒంట్లో బాగులేదని, మా ఆఫీసు మానేజరుతో అబద్ధాలాడి, ఆయనకి ఎలాగో మస్కావేసి సెలవు తీసుకుని, మా ఆవిడను చూడ్డానికి వూరికి వస్తున్నానని రాశాను. ఆ వుత్తరాన్ని కవరులో పెట్టాను. కవరుమీద మాఆవిడ అడ్రసు రాయడానికి బదులుగా, మతిమరుపుచేత, మా ఆఫీసు మానేజరు అడ్రసు రాసి పోస్టులో పడేశాను.

అబ్బో!... ఆవుత్తరాన్ని చూసిన మా మానేజరు ఏం చిందులు తొక్కాడనుకొన్నారూ? అసలే, ఆయనముక్కోపి. అట్లుండి, ఆరోజు [వుత్తరాన్ని ఆయన కళ్లబడ్డరోజు] నన్ను స్తుతించిన శ్లోకాలను జ్ఞప్తికి తెచ్చుకుంటే, ఇప్పటికీ నాకు భయమేస్తుంది! అప్పట్లో, రెండు రోజులనుంచీ ఒంట్లో బాగుండని మాట కొంతవరకు నిజమే అయినా, యీ వుత్తరం మూలంగా లీవు కోసం ఆయన దగ్గరకు వెళ్లలేకపోయాను. అరిఘోస్తూ ఆఫీసుకే వెళ్లాను.

* * *

ఉత్తరం మాట అంటూంటే, యింకో విషయం జ్ఞాపకానికి వొస్తోంది. అప్పట్లో ఒకరోజు పోస్టాఫీసు కెళ్లాను. ఇంట్లోనే పెన్ వదలి పెట్టివచ్చిన కారణంచేత, మనియార్డరు ఫారం పూర్తి చెయ్యడానికై, అక్కడే నిలుచున్న ఒకరి పెన్ బదులు తీసుకుని రాశాను. పెన్‌తో పని అయిపోయాక పరధ్యాసగా దాన్ని నాచొక్కా జేబుకి తగిలించుకుని బయలుదేరాను. ఇరవై అడుగులు నడిచి వుంటానేమో!- నాకు పెన్ బదులిచ్చిన మనిషి, లబోదిబో మని అరుచుకుంటూ, నా వెనకాలే పరుగెత్తుకొచ్చాడు. ఈకాలంలో పదిమంది జనం పోగయ్యే చోట్లలో జేబుదొంగల గలాటా జాస్తిగా వుండటం సర్వసాధారణమైన విషయమే గదా! అట్లాగే నేనూ ఏదైనా జేబుదొంగతనం చేసి వచ్చేస్తున్నానేమో నని, నాముందుగా వెళ్లుతున్న ఒక కానిస్టేబుల్ అనుకున్నట్లున్నాడు!.. క్షణం ఆలసించకుండా నన్ను గట్టిగా పట్టుకున్నాడు. పెన్ యజమాని, నా వద్దకువచ్చి, పెన్ యిమ్మని అడిగేకగాని, నాకు పెన్‌గురించి జ్ఞప్తికి రానేలేదు. ఆయన పెన్‌ని, ఆయనకు అప్పగించి, నామతిమరుపుకి మన్నించమని ఆయన్ని వేడుకొన్నాను.


* * *

ప్రఖ్యాత అడ్వకేట్ ఒకాయన మతిమరుపు మనిషిగా చాలా పేరు పొందాడు. ఒకసమయంలో కోర్టులో ఏదో పెద్ద కేసులో వాదిస్తూ, తన ఎదిరిపక్షంవారి వాదనలన్నీ ఏకరువు పెట్టడం మొదలెట్టాడు. ప్రతి పక్షంవారికి అనుకూలంగా మాట్లాడి ముగించబోతూ, ఆఖరు నిమిషంలో తన తప్పును గ్రహించాడు. వెంటనే చాతుర్యంతో "నేను ఇంతవరకూ మాట్లాడినమాదిరిగా, నా ప్రతిపక్షంవారు మాట్లాడవచ్చును. అయితే-" అని ప్రారంభించి, ఆవాదనలన్నీ ఖండించి మళ్లీ తన పక్షంవాళ్లే నెగ్గేట్టు చేసుకొన్నాడుట.

* * *

ఒకరోజు నా స్నేహితుడైన చంద్రం యింటికి వెళ్లాల్సొచ్చింది; వెళ్లాను. లోపలికి ప్రవేశించి వాడిని, వాడు చేస్తున్న పనిని చూసేసరికి నాకు నవ్వొచ్చింది. వాడు ఖాళీగావున్న వుయ్యాలని వూపుతూ కూర్చున్నాడు. చంటిబిడ్డని వాడు చూచుకుంటూంటే గాని, ఆఫీసువేళకి వంటచేసి పెట్టడానికి సాధ్యంగాదని, వాడికీ వాడి సహధర్మచారిణికీ జరిగియున్న ఒప్పందం ప్రకారం, వాడు బిడ్డను చూచుకుంటుంటాడేమో!. అయితే,

# ★ మతిమరుపు మనుష్యులు ★



చంటిబిడ్డ ఆ వుయ్యాలలో లేదు. గదిలో ఒక మూల కూచుని, బుడ్డీలోవున్న సీరానంతటినీ మీద కుమ్మరించుకుంటూ ఆట్లాడుకుంటోంది. అల్లాంటప్పుడు బిడ్డను వీడేం చూచుకుంటున్నట్టు?... "చంద్రం!...పని లేకనా ఏం, వుత్త వుయ్యాలని వూపుతున్నావ్?" అని అడిగాను. వాడు "అరె!... వుత్తవుయ్యాలా!" అంటూ ఆశ్చర్యపోతూ నాముఖంలోకి చూశాడు. వెధవ!...అంతసేపూ బిడ్డ అనుకొని దినపత్రికను వుయ్యాల్లో పెట్టి వూపుతున్నాడు. మతిమరుపులో నన్ను మించినవాడు మా చంద్రం!

* * *

ఒక ప్రొఫెసరు, తన బంధువులకి ఒక వుత్తరం రాసి పూర్తి చేశాడట! ఆ వుత్తరాన్ని వీధి మొగలో వున్న తపాలాపెట్టెలో వేసిరావడానికి బయలుదేరాడట!...అప్పుడు బయట జోరుగా వాన కురుస్తోంది. అందుకని, ఆ ప్రొఫెసరు గొడుగును చేత పట్టుకుని, తపాలాపెట్టెవరకు వెళ్లాడు. అక్కడికి రాగానే గొడుగును మూసి, దాన్ని తపాలాపెట్టెలో దూర్చాడట! మరోచేత నున్న వుత్తరాన్ని గొడుగులాగా నెత్తిమీదికి ఎత్తిపట్టుకుని, ఇంటిముఖం పట్టాడట!!...ఎలా వుంది ఈయన మతిమరుపు!!



* * *

ఒక ప్రబలమైన బొమ్మలు అమ్మే అంగడివానివద్దకు ఒకాయన వచ్చి, అడుగు పొడవు వుండేటువంటివిగా ఆరువందల బొమ్మలు తయారుచేసి యిమ్మని, ఆర్డరు యిచ్చి వెళ్లిపోయాడు. అంగడివాడు మతిమరుపుమనిషి. అడుగు పొడవుగల ఆరువందల బొమ్మలు కావాలంటే, ఆరడుగుల పొడవుగల 100 బొమ్మలు చకచకా తయారుచేసి వాటినన్నిటినీ సైనిక దళం వలె నిలబెట్టి వుంచాడు. ఆర్డరిచ్చిపోయిన ఆసామి మళ్ళీ వచ్చి చూశాడు. ఆయనకి కోపమొచ్చింది. ఆ బొమ్మలన్నీ అంగట్లోనే వుంచుకొమ్మని వెళ్లిపోయాడు. అంగడివాడు ఆ నూరు బొమ్మల ప్రక్కన, నూటవకటో బొమ్మగా, బిక్కమొహం వేసి నిలబడి పోయాడు!

* * *

మా యింటికి సమీపంలో వున్న ఒక పెద్దమనిషి, ప్రతి సాయంకాలమూ తన మనుమళ్లు ఎత్తుకొని, తను ప్రియంగా పెంచుకొనే కుక్కకి చైనుకట్టి, నడిపించుకుని పార్కుకు వెళ్లేవాడు. ఒకరోజు పార్కునుండి ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు ఏదో మతిమరపుగా కుక్కని ముంజేతులమీద ఎత్తుకొని, మనుమడి మెడకు చైను కట్టి తీసుకొస్తున్నాడు. ఆబిడ్డ ఎంత కేకలుపెట్టినా గూడా ఆయన వినిపించుకోలేదు!...

* * *

ఒకానొక రోజు మా యెదురింటి సుందరం ఆఫీసుకు బయలుదేరాడు. వాడికి ఒక చేతిలో ఆఫీసు ఫైల్సు, మరొక చేతిలో ఒక మంచినీళ్ల చెంబున్నూ వున్నాయి. భోంచేసి, చేయి కడుక్కొని ఏదో మతిమరుపుగా చెంబును వంటింట్లో వదిలెయ్యకుండా చేత్తోపట్టుకొనే ఆఫీసుకు బయలుదేరాడు! ఘనుడు!

* * *

వాడిదాకా ఎందుకూ?... క్రిందటి వారంలో నేను ఆఫీసు నుండి యింటికి తిరిగివచ్చిందే తడవుగా, మా ఆవిడని పిలిచాను.

(42-వ పేజీ చూడండి)

## ★ సుందరి ★

న్నిక్కడికి బలవంతంగా ఈడ్చుకు వచ్చాడా?"

"లేదు! నా అంతట నేనే వచ్చాను!"

"నిజంగా!"

"నిజంగా నే!"

"అయితే నువ్వు చాలా మంచి దానివన్న మాట! నీ ధైర్యం చూస్తే నాకెంతో ముచ్చటగా ఉంది!"

బ్రహ్మరాక్షసు డిలాగ అనేసరికి సుందరికి మళ్ళీ కొండంత ధైర్యం వచ్చి, లోలోపల ఉత్సాహం పొంగింది.

కాని అంతలోనే రాక్షసుడు ధనగుప్తుడి కేసి తిరిగి కళ్ళెర్రజేసి చూచి ఇలాగ అన్నాడు.

"సరే! నువ్వు అన్నమాట ప్రకారం వచ్చావు గదా! నీపని తీరిపోయింది! నువ్వు పొద్దున్నే లేచి మూటాముల్లె సర్దుకుని తొందరగా ఇంటికి దయచెయ్!... ఈ రాత్రికి మీరిద్దరు ఈ పక్కగదిలో విశ్రమించండి! ఏమిటి అలాగ దిగాలు పడి చూస్తారు! కదలండి!"

ఈ మాటలనీ అనడంతోనే బ్రహ్మరాక్షసుడు పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ అక్కడినించి వెళ్ళి పోయాడు.

ఆ రాక్షసుడి అడుగుల చప్పుడు వినబడడం మానేసినదాకా తండ్రీ కూతుళ్ళిద్దరూ అల్లాగే బొమ్మల లాగ నిలబడి పోయారు!

(ఇంకావుంది)

ఇద్దరు పెద్ద మనుష్యులు నడిరోడ్డు మీద నిల్చొని ఏవేవో విషయాలు మాట్లాడుకొంటూ వుండగా, ఎక్కణ్ణించో వచ్చిన గాడిద సరిగ్గా వీళ్ల చెవులదగ్గిరే చేరి, బిగ్గరగా ఓండ్ర పెట్టింది. కాసేపు తుమ్మింది. కాసేపు దగ్గింది. ఇది చేసే యీ మాదిరి శబ్దాల మూలంగా వీళ్లిద్దరి సంభాషణ ఆగిపోయింది. ఆచిరాకు పట్టలేక ఒక ఆసామీ రెండో ఆసామితో "యీ వెధవ గాడిదకు పడిశెం కూడా పట్టినట్లుందే?" అన్నాడు. అంతలోనే జ్ఞాపకం వచ్చింది కాబోలు—"అన్నట్లు నీ పడిశెం ఎల్లా వుంది?" అని అదే గుక్కలో అడిగేశాడు.

## ★ మతిమరుపు మనుష్యులు ★

(34-వ పేజీ తరువాయి)

"ఇదిగో! పిల్లా! మీ అమ్మగారి వద్దనుంచి వుత్తరం వచ్చింది" అంటూ నాచొక్కా జేబులోనున్న వుత్తరాన్ని తీసి దానికి యిచ్చాను. మాఆవిడ వికసించిన ముఖంతో ఆవుత్తరాన్ని అందుకొంది. కానీ, మరుక్షణంలోనే పరాశక్తిరూపమెత్తి విషసర్పంలాగా బుస కొట్టింది. "ఇది ఐదురోజుల క్రితం నేను మా అమ్మగారికి రాసిన వుత్తరంగదా!...ఆఫీసు కెళ్లేప్పుడు తపాలాపెట్టెలో వేయమని మీచేతి కిచ్చాను...భా భా! ... మీకు యిచ్చేబదులు ఏ మొండిగోడవద్ద పారేసినా వుత్తరం యీపాటికి మావూరు చేరివుండేది!" అని వురిమింది. "ఇంతకీ మాఅమ్మ రాసిన వుత్తరం ఏదీ?" అని నిలదీసి అడిగింది. కంగారుగా నాచొక్కా జేబులు, పెంట్ జేబులూ అన్నీ వెదికాను.

"ఎక్కడ?" అని మా ఆవిడ మళ్ళీ గర్జించింది. "అరెరె!... నువ్వు తపాలా పెట్టెలో వెయ్యమని చెప్పిన వుత్తరం, అదే కాబోలునని, దాన్ని ఇంతకు ముందే వచ్చేదారిలో పోస్టు చేశాను" అన్నాను.

ఆతర్వాత మా యిద్దరి మధ్యా నడచిన కీచులాట నంతా యిక్కడ వివరించడానికి నేను తయారుగా లేను. కానీ, నా మతిమరుపు మూలంగా మాఆవిడకి రెండు చీరలు నాలుగు జంపర్లు కొని యిస్తేనేకాని ఆవిడ అలక తీరలేదని మాత్రం చెప్పక తప్పదు. కాబట్టి చెప్పుతున్నాను.

ఈవిధంగా ఎంత పెద్ద మనుషులైనా సరే 'మతిమరుపు లేకుండా వుండరు. మన వుపప్రధాని రాధాకృష్ణగారుగూడా, కాలేజి విద్యార్థి జీవితంలో షేవింగ్‌ను సగం పూర్తి చేసుకొని, ఏదో మతిమరుపుగా క్లాసుకి వెళ్లిపోయేవారట!... మా ఆఫీసు మేనేజరుగూడా ఒకొక్క సమయాల్లో సిగరెట్‌ను అంటించడానికి బదులు, పెన్సిలును నోట్లో పెట్టుకొని దానికి అగ్గిపుల్ల అంటించటంకద్దు! ఆయనకిమల్లేనే ఆయన తోటమాలి కూడా మతిమరుపు మనిషి. వాన కురిసిపోతుంటేకూడా లెక్కచెయ్యకుండా, గొడుగు వేసుకుపోయి చెట్లకి నీళ్లుపోసేవాడు ★